# ఘనంగా అంబేద్కర్ జయంతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మంచిర్యాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏసీసీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ సేవలను, సూత్రాలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గం యువతకు ప్రేరణగా నిలవాలని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




**బీఎస్పీ ఆధ్వర్యంలో..**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి, బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సంయుక్తంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మిఠాయిలు పంచారు. అనంతరం చార్వాక సమావేశ ప్రాంగణంలో బీఎస్పీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కోఆర్డినేటర్ కాదాశి రవీందర్ మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలను అమలు చేయడమే బీఎస్పీ లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్ బాబు, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు రామిల్ల రాజేష్, నాయకులు మంతెన రవి వర్మ, కుమ్మరి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.







## ట్రస్మా రాష్ట్ర కార్యవర్గంలో గోపతి సత్తయ్యకు చోటు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ తొలి సమావేశం నిన్న కాస్ హోటల్, కొంపల్లిలో రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాల నుంచి ట్రస్మా జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు సహా సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఫీజు రెగ్యులేటరీ బిల్లుపై ప్రభావాలు, అకడమిక్ క్యాలెండర్ 2025–26, టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, వివిధ కమిటీల ఏర్పాటు అంశాలపై చర్చించి కీలక తీర్మానాలు చేశారు. రాష్ట్ర కార్యవర్గ విస్తరణలో భాగంగా మంచిర్యాల జిల్లా ఆదిత్య హై స్కూల్, సిసిసి కరస్పాండెంట్ గోపతి సత్తయ్యకు రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యుడిగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ రాపోలు విష్ణువర్ధన్ రావు, జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి చంద్రమోహన్ గౌడ్ సహా పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపతి సత్తయ్య మాట్లాడుతూ... నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరికి, రాష్ట్ర, జిల్లా నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.




# బీజేపీలో ఉంటే కేంద్రమంత్రిని అయితుండే

- సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానిస్తేనే కాంగ్రెస్ లోకి వచ్చా..
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి సంచలన వ్యాఖ్యలు





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

'నేను బీజేపీలో ఉంటే కేంద్ర మంత్రిగా అవకాశం ఉండేది. కానీ ప్రజల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా పెట్టుకున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానిస్తేనే కాంగ్రెస్ లోకి వచ్చా'

అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణతో కలిసి ఆవిష్కరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తనపై కొందరు పరోక్షంగా విమర్శలు చేస్తున్న నేపథ్యంలో వివేక్ ఘాటుగానే స్పందించారు. పార్టీ మారడం కాదు, ప్రజలకు ఎంత మేలు చేశామన్నదే ముఖ్యం. కాకా కుటుంబానికి సేవే ఆయుధం. పెద్దపల్లి పార్లమెంటులో ఎన్నోసార్లు మా కుటుంబమే గెలిచింది. 2019లో కేసీఆర్ నమ్మించి చివరి నిమిషం లో టికెట్ ఇవ్వకుండా మోసం చేశాడు. ఆ వెంటనే ప్రజల్లోకి వెళ్లి మా కుటుంబ విలువలను నమ్మించి విజయం సాధించాం అన్నారు. బాల్క సుమన్ తనపై చేసిన సవాల్ ను గుర్తు చేస్తూ... మా బలం, ప్రజ ల విశ్వాసంతో కేవలం 22 రోజుల ప్రచారంతోనే అతన్ని ఓడించగలిగాం. ప్రజలు మా కుటుంబాన్ని మళ్లీ నమ్మారు అని వివరించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక చెన్నూరు నియోజకవర్గంలో ఇసుక, బియ్యం దందాలకు అడ్డుకట్ట వేసినట్లు చెప్పారు. ప్రజల అభివృద్ధే నా లక్ష్యం. చట్ట పరిధిలో జరిగే పనులకు మద్దతు ఇస్తాను. కొన్ని శక్తులు పోలీసులను అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నాయి. అలాంటి నీచ రాజకీయాలు నాకు అసహ్యం. ప్రజలు ఎవరు నిజంగా పనిచేస్తున్నారో గమనిస్తున్నారు అని విమర్శించారు. నాయకుడు ప్రజల్లో గుర్తింపు పొందాలంటే మంచి పనులు చేయాలి. అదే ఎన్నికల్లో గెలుపునకు బాటపెడుతుంది అని ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యానించారు.

### నేను సంతకం పెడితేనే పీఎస్సార్ కు ఎమ్మెల్సీ టికెట్

- నేను సీనియర్ ని.. మంత్రి పదవి అడిగితే తప్పేముంది
- తెలంగాణ కోసం మా కుటుంబం కొట్లాడింది
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాట్ కామెంట్స్

ఎమ్మెల్యే పీఎస్సార్ వ్యాఖ్యలపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం స్పందించారు. పీఎస్సార్ కు ఎమ్మెల్సీ టికెట్ కోసం ఆయన తండ్రి రఘుపతి తమ ఇంటికి వచ్చారని తెలిపారు. కేవీపీ, వైఎస్సార్ తో తమ తండ్రి కాకా వెంకటస్వామి మాట్లాడి టికెట్ ఇప్పించారని, అప్పుడు మంత్రి గా ఉన్న తాను సంతకం పెడితేనే పీఎస్సార్ ఎమ్మెల్సీ అయ్యారని చెప్పారు. తమ కుటుంబం తెలంగాణ కోసం కొట్లాడిందని గుర్తు చేశారు. ఇప్పుడున్న కెబినెట్ లో ఉన్న అందరికన్నా తాను సీనియర్ నని చెప్పారు. మంత్రి పదవి అడగడంలో తప్పేముందన్నారు. గతాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## అగ్ని ప్రమాదాల నివారణతో
# సురక్షిత భారత్ నిర్మిద్దాం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని, సురక్షిత భారత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా యంలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ వద్ద ఆయన అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక కరపత్రాలు, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20 వరకు అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్య క్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, చెన్నూర్ ప్రాంతాల అగ్నిమాపక కేంద్రాల అధికారులు, సిబ్బంది ఆసుపత్రులు, థియే టర్లు, రైల్వే స్టేషన్లు, ఫంక్షన్ హాల్లు, పాఠ శాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాల యాలు, వ్యాపార భవనాలు, గోదాములు వంటి ప్రదేశాల్లో సందర్శనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన అగ్నిమాపక కేంద్రాల నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, ఇతర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



# దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

**శెనార్తి మీడియా గోదావరిఖని**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళిత బహుజన వర్గాల అశజ్యోతి అని రామగుండం మాజీ శాసన సభ్యులు, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి పురస్కరించకుని రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరుకంటి మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన బాటలోనే నేడు దేశం నడుస్తుందని, ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా, హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించిన ఘనత మొదటి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు దక్కుతుందని తెలిపారు. అంతేకాకుండా దళితుల అభివృద్ధి కోసం 'దళిత బంధు' పథకాన్ని ప్రవేశపెట్టి వారికి జీవనోపాధి కల్పించారని, వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, బాదే అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, బొ డ్డుపల్లి శ్రీనివాస్, అచ్చే వేణు, నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, దొమ్మేటీ వాసు, కోడి రామకృష్ణ, సట్టు శ్రీనివాస్, రామరాజు, ఆవునూరి వెంకటేష్, ముద్దసాని సంధ్యా రెడ్డి, గుర్రం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు నివాళి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలో సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు అంతడ్పుల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎస్సై రవి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చింతరెడ్డి పద్మ, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తాడికల్, కరీంపేట, అంబాలపూర్, కన్నాపూర్, మొలంగూర్ గ్రామాల్లో బాబా సాహెబ్ కు నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ పులి కోట రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు కనకం శంకర్, దాసారపు భద్రయ్య, కోంద్ర రాజయ్య, కొమురయ్య, బోడ సుధాకర్, బొజ్జ రవి, మెరుగు శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి పవన్, కొత్తగట్టు ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, క్యాదాసి భాస్కర్, చౌడమల్ల వీరస్వామి, దేవుని కిష్టయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




# ఘనంగా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'




**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

ఖని గౌతమినగర్ లో ఒకే దేశం - ఒకే ఎన్నిక కార్యక్రమం జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ ఎక్స్ సర్వీస్ మెన్స్ తో పాటు ఆర్మీ సర్వీస్ మెన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి సమయాన్ని, వనరులను సమర్ధవంతంగా వినియోగించాలంటే, ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానాన్ని అమలుపరచడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. యువకుల నాయకత్వం దేశానికి ఎంతో అవసరం ఉందని, యువతలో రాజకీయ చైతన్యం పెరగాలని వారు అభిప్రాయ పడ్డారు. దేశ సేవ చేయడం ఎంతో గర్వకారణమని, ఆర్మీలో పనిచేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నామని ఆర్మీ సర్వీస్ మెన్లు వివరించారు. అనంతరం వారు దేశానికి చేస్తున్న సేవలకు గౌరవంగా ఆప్యాయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్టీపీసీ కన్వీనర్ సాగి కిషన్ రావు, బీజేపీ నాయకులు మహావది రామన్న, చుక్కల రాములు, ఆర్మీ ఎక్ససర్వీస్ మెన్ సత్యనారాయణ, ఓదెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు నిధులు విడుదల చేయాలి



**మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గుండారం, బెజ్జంకి మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ పాల్గొని విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు కింద రూ.3 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా, ప్రస్తుతం అవి ఫ్రీజ్ అయ్యాయని తెలిపారు. నూతనంగా ప్రకటించిన రూ.12 లక్షల నిధులను తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. బెజ్జంకి అరుంధతి కళ్యాణ మండపం పనులను పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలన్నారు. నియోజకవర్గంలో 73 అంబేద్కర్ విగ్రహాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని, ఆయన చూపిన మార్గం బడుగు వర్గాలకు ఆశాజ్యోతి అని వివరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి



**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని, హైదరాబాద్‌లోని తన నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, సామాజిక సమానత్వం, న్యాయం, విద్యా అభివృద్ధికి అంబేద్కర్ పోషించిన పాత్ర దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆయన కలల భారతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఇంచార్జ్ ఝాన్సి రాజేం దర్ రెడ్డి మాట్లాడుతూ, మహానేతలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారి ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చి ప్రజల అభివృద్ధికి వినియోగించడం అవసరమన్నారు. అంబేద్కర్ జీవితం ప్రతి నాయకుడికి మార్గదర్శిగా నిలవాలన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



మహానేత అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు ఎస్ఐ తాండ్ర నరేష్. సోమవారం గన్నేరువరం మండల కేంద్రం సహా పలు గ్రామాల్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గన్నేరువరం కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ తాండ్ర నరేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అమోఘమని, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జువ్వాడి మన్మోహన్ రావు, మార్కె ట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, మాజీ ఎంపీపీ నేత సుధాకర్, నాయకులు చింతల శ్రీధర్ రెడ్డి, జీవన్, కవ్వంపల్లి రాజయ్య, బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలి

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను టెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు రహమాన్ నేతృత్వంలో సభ్యులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఎన్నో ఉన్నత పదవులను త్యజించి తన జీవితాన్ని దేశ ప్రజల హక్కుల కోసం అంకితం చేశారని అన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని చాటడానికి, అస్పృశ్యతను నేరంగా ప్రకటించడానికి చేసిన కృషి అమూల్యమని పేర్కొన్నారు. భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ రచన సంఘ అధ్యక్షునిగా అంబేద్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మతం పేరుతో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనే ప్రయత్నంగా హిందూ కోడ్ బిల్లు రూపొందించారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధన, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు చల్లూరి సాధయ్య, పోలు రాజశేఖర్, ఉపాధ్యక్షులు ధబ్బెట సతీష్, అన్నబోయిన రాజేందర్, శ్రీధర్ రెడ్డి, హెచ్చిసి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, చుక్కా భాస్కర్, మీడియా కన్వీనర్ అంకూస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఈదునూరి రాజేష్, మంజూష, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్



**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. చిగురు మామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అందెమేకల పరశురాములు ఆధ్వర్యంలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీని వాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, డీసీసీ అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారా యణ, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, మండల మహిళా అధ్యక్షురాలు పోలు స్వప్న, మండల ప్రధాన కార్యదర్శి పూల లచ్చి రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిన వేణు, మైనార్టీ సెల్ మండల అధ్య క్షుడు ఎండి షాబుద్దీన్, ఎమ్మార్పీఎస్ మం డల అధ్యక్షుడు దొబ్బల బాబు, సీనియర్ నాయకులు వంగర మల్లేశం, ఎనగందుల లక్ష్మణ్, మిట్టపల్లి ఆదర్శ్, దొబ్బల బిక్షపతి, కాత తిరుపతి, వంగ కనుకయ్య, గాదపాక సునీల్, బొయిని వంశీకృష్ణ, కవ్వంపల్లి సంజీవ్, సందబోయిన సంపత్, కవ్వంపెల్లి సంజీవ్, దోమ తిరుపతి, మైలారం సునీల్, దొబ్బల బాబు, కోనేటి రాములు, బాలకృష్ణ చారి, జిల్లెల్ల రమేష్, చింటూ, వంశీ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ను అవమానించింది కాంగ్రెస్ కాదా?

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



- రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పేరిట డీజే పాటలకు డాన్స్ లు
- ఇదేనా అంబేద్కర్ త్యాగాల పట్ల మీ చిత్తశుద్ధి?"
- బీజేపీ మండల అధ్యక్షుడు నికేష్
- అంబేద్కర్ విగ్రహానికి నివాళి

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానించింది కాంగ్రెస్ కాదా? అని బీజేపీ మండల అధ్యక్షుడు నికేశ్ ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ చేసిన త్యాగాలను తక్కువచేసే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పేరిట కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో డీజే పాటలతో నృత్యాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "ఇదేనా అంబేద్కర్ త్యాగాల పట్ల మీ చిత్తశుద్ధి?" అంటూ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. అంబేద్కర్ భావజాలాన్ని కాపాడే పార్టీ బీజేపీయేనని నికేశ్ పేర్కొన్నారు. అంబేద్కర్ కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది బిజెపి అని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు.అంబేద్కర్ జయంతికి సెలవు దినంగా ప్రకటించింది కూడా భారతీయ జనతా పార్టీ అని స్పష్టం చేశారు. ఈ విషయాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక న్యాయం పరిరక్షణకు తమ పార్టీ కృషి చేస్తోందని, అసలైన రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు బీజేపీ వైపే నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విలాసాగరం రామ చంద్రం, గంట గౌతమ్, పేరం రాజు, జాలి శ్రీనివాస్ రెడ్డి , బుర్ర సత్తయ్య , కొలుపుల వేణు, గూడూరి జగన్ , వినయ్, విలాసాగరం రాము, దొగ్గల జగన్ , సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి రథోత్సవం

**శెనార్తి మీడియా, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంటలోని అపరా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి చంద్ర రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది భక్తులు పాల్గొని రథాన్ని ఆలయ మాడ వీధుల్లో లాగుతూ స్వామి వారి దర్శనాన్ని పొందారు. ఎండ తీవ్రత మధ్య భక్తులు బారులు తీరినా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంచినీరు, నీటిని చల్లే ట్యాంకర్లు వంటి ఏర్పాట్లు చేశారు.ఆలయ కమిటీ చెర్మెన్ రామారావు మాట్లాడుతూ అన్ని శాఖల సహకారంతో భక్తులకు సౌకర్యాలు కల్పించామని తెలిపారు. హుజురాబాద్ ఏసీపీ పర్యవేక్షణలో ట్రాఫిక్, భద్రత ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లంతకుంట ప్రాంతాల్లో భారీగా వాహనాల రద్దీ కనిపించింది. రామాయణ కాలం నాటి చరిత్ర కలిగిన ఈ ఆలయానికి ప్రత్యేకత ఉంది. రాముడు ఇక్కడ 13 రోజులు సేదతీరాడని, తండ్రి దశరథుడికి ఇక్కడే శ్రాద్ధకర్మలు చేసినట్లు ప్రతీతి. ఇక్కడ పుట్టు మచ్చలతో ఉన్న ఉత్సవమూర్తులు భక్తులను ఆకర్షించాయి. నేటితో చంద్ర రథోత్సవం ముగిసినా, జాతర ఉత్సవాలు దాదాపు 40 రోజులు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.





## మానసా దేవి ఆలయ వేలం రూ.7.55 లక్షలు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

కాసింపేటలోని ప్రసిద్ధ స్వయంభు మానసా దేవి ఆలయంలో సోమ వారం నిర్వహించిన ఒడి బియ్యం, చీరల తదితర సామాగ్రి వేలంపాట లో స్థానికుడు ఆడెపు సంతోష్ కుమార్ రూ.7,55,000కు టెండర్ ను పొందాడు. ఈ సందర్భంగా ఆల య కమిటీ అధ్యక్షుడు ఏలేటి చంద్ర రెడ్డి, సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదా లు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో 14 మందికి గాయాలు

**శెనార్తి మీడియా, జగిత్యాల రూరల్:**

మండలం మోరపల్లిలో ఓ పిచ్చికుక్క 14 మందిపై దాడిచేసింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాల య్యాయి. ఆదివారం సాయంత్రం గ్రామంలోకి వచ్చిన పిచ్చికుక్క వీధుల్లో వెళ్తున్న నలుగురిపై దాడిచేసింది. సోమవారం మధ్యాహ్నం కూడా మళ్లీ ఊళ్లోకి వచ్చి 10 మందిపై దాడిచేసింది. బాధితులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.





# ఆటో బోల్తా : మహిళా కూలీలకు తీవ్ర గాయాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కాపులపల్లిలో మొక్కజొన్న కంకి తీయడానికి వెళ్లిన ఎనిమిది మంది కూలీలు, పని ముగించుకొని శంకరపట్నం మండలం రాజాపూర్‌కు తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఆముదాలపల్లి వద్ద ఆటో అదుపుతప్పి బ్రిడ్జి కిందకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కనకం అంజయ్య, ఆయన భార్య సారమ్మ, కోడళ్ళు నందిని, సంగీత, కుక్కముడి వీరయ్య, ఆయన భార్య ఎల్లమ్మ, మాతంగి మదనమ్మ, మాతంగి శంకరమ్మలు గాయాలు పొందారు. వారిలో అంజయ్య, మదనమ్మ, శంకరమ్మలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సర్వీసు ద్వారా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా గాయాలపాలైన వారిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనాలలో కరీంనగర్, హుజురాబాద్, జమ్మికుంట ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అంజయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

